




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 255

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor


మంగళవారం 24 ఫిబ్రవరి 2026


# సామాజిక సమానత్వం కోసమే అహర్నిశలూ కృషి

- బలహీన వర్గాల సంక్షేమానికే మా ప్రాధాన్యత
- అసమానతలు తగ్గించడానికే పీ4 కార్యక్రమం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు గతాని కంటే ఎక్కువ కేటాయింపులు
- స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు
- సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,కలంకౌంటర్ :** సామాజిక సమానత్వం కోసమే కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గించి జనాభా దామాషా ప్రకారం బలహీన వర్గాలు అన్నిటా ప్రాతినిధ్యం వహించేలా సామాజిక సాధికారత సాధించేలా ముందుకు వెళున్నామని వెల్లడించారు. బడ్జెట్‌లో సంక్షేమ శాఖల కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదని అన్నారు. వీటితో పాటు అన్ని వర్గాలకూ మరింత అదనంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఆటో డ్రైవర్ల సేవలో, మత్స్యకారుల సేవలో పథకాలతో పాటు చేనేత కార్మికులకు కూడా ఉచిత విద్యుత్ లాంటి సంక్షేమాన్ని అందించి న్యాయం చేస్తున్నామని అన్నారు.

**బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయింపులు పెంచాం..** 'చౌక దుకాణాల ద్వారా వినియోగదారులకు మరింత సమర్ధంగా సరకులు అందించేందుకు ప్రణాళిక చేయటంతో పాటు సక్రమంగా చేరవేసేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నాం. సంక్షేమ పథకాలను సాంకేతికత సాయంతో అనుకున్న సమయానికే చేరేలా చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రూ. 3.32 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాం. ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయింపులు గతం కంటే పెంచాం. కేటాయించిన మొత్తాలను ఆ వర్గాలకే ఖర్చు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తాం. సంక్షేమ కార్యక్రమాల ఇవ్వడంతో పాటు ప్రతి వర్గాన్ని బలోపేతం చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ప్రజల ఆదాయాలను పెంచి జీవనప్రమాణాలు మెరుగుపరుస్తాం. స్వర్ణాంధ్ర 2047 విజన్ నిర్దేశించుకున్నాం. ప్రస్తుతం రూ.3 లక్షలు ఉన్న తలసరి ఆదాయాన్ని 2047 నాటికి రూ.54 లక్షలకు పెంచే నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకెళుతున్నాం' అని ముఖ్యమంత్రి అన్నారు.



**దృష్టంతా భావితరాలపైనే..** 'మా దృష్టి అంతా భావి తరంపైనే పెట్టాం. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాల వంకూ బలోపేతం చేశాం. రెసిడెన్షియల్ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యను అందిస్తున్నాం. పౌష్టికాహారంతో పాటు మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రాన్ని పునర్నిర్మించి అభివృద్ధి చేసి ఆదాయం పెంచడంతో పాటు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు చెప్పాం. నాడు చెప్పినట్లు గానే నేడు ముందుకెళుతున్నాం. పీపీపీ ద్వారా గతంలో సంపద సృష్టికి ముందుకెళ్లాం. పీపీపీ విధానంలో రోడ్లు, విమానాశ్రయాల నిర్మాణం, మౌలిక వసతులు కల్పన జరిగింది. వీటితో సంపద పెరిగి, మెరుగైన వసతులు ఏర్పడినా అసమానతలు తగ్గలేదు. ఆర్థిక తారతమ్యాలు తగ్గించేందుకు పీ4 విధానాన్ని తీసుకొచ్చాం. 10 లక్షల బంగారు కుటుంబాలను 1 లక్ష మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ఏ కార్యక్రమంలోనైనా ఫలితాలు వెంటనే రావు. అసమానతలు తగ్గించేందుకు పీ4 మించి కార్యక్రమం మరొకటి ఉండదు. కొందరికి ఉద్యోగాలు ఉండవు. ఇంకొన్ని వర్గాలు కూలీ పని చేస్తే తప్ప పూట గడవదు. అలాంటి వారిని ఆదుకుని పైకి తీసుకురావాల్సి ఉంది. 2047కు భారత్ అగ్ర దేశంగా తయారవుతుంది. వికసిత్ భారత్‌గా తయారయ్యేనాటికి అసమానతలు ఉండటం మంచిది కాదు. ఇది కేవలం పబ్లిక్ పాలసీల వల్లే సాధ్యం అవుతుంది. చట్టసభల్లో ఉన్న మనమందరం కృత నిశ్చయంతో పని చేస్తే ఇది కష్టం కాదు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**స్థానిక సంస్థల కంటే ముందే బీసీలకు రిజర్వేషన్లు..** శాసన సభలో ఉన్న మనపై ఎంతో నమ్మకం ఉంచి ప్రజలు ఓట్లు వేశారు. 94 శాతం స్ట్రైక్ రైట్‌తో ఎన్డీఏకు సీట్లు ఇచ్చారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కోవాలి. బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను గత ప్రభుత్వం 24 శాతానికి తగ్గించింది. గత ప్రభుత్వం తగ్గించిన రిజర్వేషన్లు మళ్లీ 34కు పెంచేందుకు వన్ మెన్ కమిటీ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలకు

3లో

## కస్తూర్బా స్కూళ్లలో జీతాల పెంపుపై కేంద్రంతో సంప్రదిస్తున్నాం

- ఉగాది నాటికి జాబ్ క్యాలెండర్ విడుదలకు కసరత్తు చేస్తున్నాం
- అసెంబ్లీలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని కేజీబీవీల్లో అడ్మిషన్లు దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఉన్నాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కూన రవికుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... గత రెండేళ్లలో ఫలితాలు బాగా మెరుగుపర్చాం, రాష్ట్రంలో కేజీబీవిలో చేరడానికి విద్యార్థినులు పోటీ పడుతున్నారు. కేజీబీవి ప్రోగ్రామ్ సెంట్రలైజ్డ్ స్పాన్సర్డ్ స్కీమ్. కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తే, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. జీతాలు పెంచాలన్నా, ఏ ఇతర నిర్ణయం తీసుకోవాలన్నా కేంద్ర, రాష్ట్రాలు కలిసి చేయాల్సివుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ ను పెంచాల్సివుంది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తున్నాం. దానికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా స్పందించారు. ఎన్ టీఎస్ ను పెద్దలందరూ కోరారు. దానికి కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవాల్సి ఉంది. దాదాపు 11 వేల మంది ఈ వ్యవస్థలో పనిచేయడం జరుగుతోంది. ఇది 11 వేల మందికి సంబంధించిన విషయం. కేంద్ర ప్రభుత్వం ఒప్పుకున్న తరువాతే జీతాల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై హైకోర్టులో పిటిషన్ ఉంది, దానిపై రివ్యూ చేయడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం పీఏబీ అప్రూవ్ చేసిన తరువాత జీతాలు పెంపుపై మేం బాధ్యత తీసుకుంటాం. ఇప్పటికే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే ఎక్కువ జీతాలు చెల్లించడం జరుగుతోంది. అయినా నేను ధర్మేంద్ర ప్రధాన్ గారిని కలిసినప్పుడు మాకు బడ్జెట్ పెంచమని కోరడం జరిగింది. మేం తప్పనిసరిగా ఫాలోఅప్ చేస్తాం. డీఎస్సీ గురించి కూడా సభ్యులు ప్రస్తావించారు. గత సంవత్సరంలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించాం. ఈ ఏడాది ఉగాది నాటికి మెగా జాబ్ కేలండర్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ చేయాల్సివుంది. మళ్లీ జోనల్ రీ నోటిఫికేషన్ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ వచ్చింది. రీయూనిఫికేషన్ చేయాల్సిన అవసరముంది. అన్ని డిపార్టుమెంట్లు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. ఉగాది నాటికి మళ్లీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. దాంట్లో ఉపాధ్యాయ పోస్టులు కూడా ఉంటాయని మంత్రి లోకేష్ చెప్పారు.

## సోషల్ మీడియా పై అసెంబ్లీలో చర్చ

- ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న చట్టాలను పరిశీలిస్తున్నాం
- 20 నెలల్లో 1384 కేసులు నమోదు.. హోం మంత్రి.



**అమరావతి, కలంకౌంటర్ :** సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల నియంత్రణపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు హోంమంత్రి అనిత సమాధానం ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల కట్టడికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు ఉపసంఘం రెండుసార్లు సమావేశమై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చర్యలను సమీక్షించినట్లు చెప్పారు. మన రాష్ట్రంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే సమర్థవంతంగా ఉంటాయన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్వేషపూరిత, అసభ్య పోస్టుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సోషల్ మీడియా పోస్టులపై 1,384 కేసులు నమోదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,067 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాల కట్టడికి కొత్త చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు సోషల్ మీడియా వినియోగించకుండా చట్టం తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు.



## ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం: హోం మంత్రి



**అమరావతి, కలంకౌంటర్ :** జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

## ప్రజా ఫిర్యాదులను సద్వినియోగం చేసుకోండి - కమిషనర్ కే అనూష



**కందుకూరు, కలంకౌంటర్ :** ప్రజా ఫిర్యాదులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కే అనూష తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం కమిషనర్ అనూష ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏడు ఫిర్యాదులు అందాయని ఆమె తెలిపారు. ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం చూపుతామని ఆమె ఫిర్యాదుదారులకు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ఈ ఫోన్ నెంబర్ 9177700267 కి ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు





**తాళ్లపూడి,కలంకౌంటర్ :** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద ఉన్న పరీక్షా కేంద్రానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఉదయాన్నే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను పోలీసులు మరియు కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాలుకు పంపించారు. ఎస్సై టి రామకృష్ణ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు. పరీక్ష కేంద్రం వద్ద పరీక్షలు ముగిసేవరకు 100 మీటర్లు వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది అన్నారు. సోమవారం నిర్వహించిన తెలుగు, సంస్కృతం, జనరల్ ఫౌండేషన్ కోర్సు సంబంధించిన పరీక్షకు 352 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 326 మంది హాజరైనట్లు 26 మంది గైర్హాజరు అయినట్లు కళాశాల చీఫ్ సూపరిండెంట్ సూర్యకళ , డిపార్ట్మెంటల్ ఆఫీసర్ సునీల్ జయచంద్ర తెలిపారు.

## తిరుమల లడ్డూ వివాదం.. ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట

**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలకు సంబంధించిన వివాదంలో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణను కొనసాగించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కమిషన్ నియామకాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇవాళ కీలక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తిరుమల నెయ్యి వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ సిట్ దర్యాప్తు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా మరో కమిటీని ఎలా ఏర్పాటు చేస్తుందని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సీఎం చంద్రబాబు, టీటీడీ, సీబీఐని ప్రతివాదులుగా చేర్చారు. స్వామి వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. ఒక దర్యాప్తు సంస్థ విచారణ మరో కమిటీపై ప్రభావం చూపదని స్పష్టం చేసింది. “రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ పరిపాలనాపరమైన లోపాలను గుర్తించేందుకు ఏర్పాటు చేయబడింది. ఇది సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేస్తుందని మేము భావించడం లేదు. చట్ట ప్రకారం సిట్, ఏకసభ్య కమిటీ తమ తమ విధులను నిర్వర్తించవచ్చు” అని ధర్మాసనం పేర్కొంది.

# రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

- రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఈ ఘటనలో నలుగురు మృతి, 13 మందికి పైగా అస్వస్థత
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- ల్యాబ్ రిపోర్టుల తర్వాత నిందితులపై కఠిన చర్యలని స్పష్టం

**అమరావతి,కలంకౌంటర్ :** రాజమహేంద్ర వరంలో కల్తీ పాలు తాగి నలుగురు మృతి చెం దడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందు తున్న బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. రాజమండ్రిలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, లాలాచెరువు ప్రాం తాల్లో కల్తీ పాలు సేవించడం వల్లే ఈ విషా దం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు మరణించగా, 13 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చాలామంది కిడ్నీలు పూర్తిగా పనిచేయకపోవడంతో (అనూరియా) బాధప డుతున్నట్లు వైద్యులు ప్రాథమికంగా గుర్తిం చారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పాలు సరఫరా చేసిన కొరుకొండ మండలానికి చెందిన గణేష్ అనే విక్రేతను అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు. అధికారులు ప్రభావిత ప్రాంతాల్లోని సుమారు 106 కుటుంబాలపై సర్వే చేపట్టా రు.



75 మంది నుంచి రక్త, మూత్ర నమూనా లతో పాటు, పాల శాంపిళ్లను సేకరించి పరీక్ష ల కోసం విశాఖపట్నం ల్యాబ్‌కు పంపారు. ఈ ల్యాబ్ నివేదికలు వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కొత్త నియామకాల ద్వారా రెవెన్యూ వ్యవస్థ బలోపేతం





**అమరావతి,కలంకౌంటర్ :** ప్రజలకు నిరంతం సేవలందించే రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా కొత్తగా సిబ్బందిని నియామకం చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా సీసీఎల్ఏ ప్రధాన కార్యాలయంలో పని చేసేందుకు కొత్తగా 31 మంది జూనియర్ అసిస్టెంట్లకు తన చేతుల మీదుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ నియామక పత్రాలు అందజేశారు. అందరూ కష్టపడి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. రానున్న కాలంలో రెవెన్యూ శాఖ చేయాల్సిన పని చాలా ఉందని, మీరంతా చిత్తశుద్ధితో కష్టపడి పని చేయాలని కోరారు. వీరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పని చేసేందుకు 114 మంది డిప్యూటీ తహశీల్దార్లను కూడా నియామకం చేసినట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇంటి స్థలాల కేటాయింపు, రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, వరదలు, తుఫానుల వంటి సమయాల్లో తక్షణ సహాయం, కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాల జారీ, పరిశ్రమలు, ప్రభుత్వ ప్రాజెక్టులకు భూముల సేకరణ లాంటి కీలక పనుల్లో అందరూ నిజాయితీగా పని చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మీ పాల్గొన్నారు.

# త్వరలో కుట్టు మిషన్ల పంపిణీ

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- నూతన బడ్జెట్ లో సింహభాగం బీసీలకే...
- నేతన్న భరోసాకు రూ.250 కోట్లే కేటాయింపు
- రూ.500 కోట్లతో 20 ఎంజేపీ స్కూళ్ల భవనాల నిర్మాణం
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు డెడికేటెడ్ కమిషన్ నియామకం
- బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నాం
- టీడీపీతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం
- బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్ పై చర్చలో మంత్రి సవిత



**అమరావతి,కలంకౌంటర్ :** బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు త్వరలో కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, బడ్జెట్ లో సింహభాగం నిధులు వారికే కేటాయించారని తెలిపారు. 20 నెలల కూటమి ప్రభుత్వ పాలన బీసీల అభ్యున్నతికి ఇచ్చిన హామీలతో ఇవ్వని హామీలను సైతం అమలు చేశామన్నారు. నేతన్న భరోసా పథకం కింద రూ.250 కోట్లు వెచ్చించనున్నామన్నారు. 2026-27 బడ్జెట్ కు సంబంధించి అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్ పై చర్చ సందర్భంగా రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ బీసీలకు ప్రాధాన్యమిచ్చి...వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అని కొనియాడారు. అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు...బీసీలకు రెండు కళ్లవంటి వారన్నారు. .3.32 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ లో వెనుబడిన తరగతులకు రూ.51,020.56 కేటాయించారని వెల్లడించారు. నూతన బడ్జెట్ లో సింహభాగం నిధులు బీసీలకే కేటాయించారన్నారు. 20 నెలల కూటమి ప్రభుత్వ పాలన బీసీల అభ్యున్నతికి ఇచ్చిన హామీలతో ఇవ్వని హామీలను సైతం అమలు చేశామన్నారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేశామని, గీత కులాలకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని తెలిపారు. నాయీబ్రాహ్మణ సెలూన్లకు ఉచిత విద్యుత్ సరఫరాను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచామన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు, దేవాలయ సేవల్లో ఉన్న నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచామని తెలిపారు.

**త్వరలో కుట్టు మిషన్లు..** ప్రతి ఇంటి నుంచి ఒకరు వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పనలో భాగం గా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు త్వరలో కుట్టు మిషన్లు అందజేయనున్నామన్నారు. రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 అమలు చేయనున్నామని, ఈ పథకంలో భాగంగా లబ్ధిదారులకు

**బీసీల రక్షణ చట్టానికి తుది రూపు..** ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మగ్గం నేసే చేనేతలకు 200 యూనిట్ల వరకు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వ తదుపరి చర్యకు పంపించామన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం రూపకల్పనకు తుది రూపు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. స్థానిక సంస్థల్లో కూడా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఇటీవలే రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్ ను నియమించామన్నారు. ఈ కమిషన్ కు నివేదిక అందజేయడానికి 45 రోజుల గడువు విధించామని మంత్రి సవిత తెలిపారు.

**రూ.500 కోట్లతో ఎంజేపీ స్కూళ్ల నిర్మాణం..** అన్ని గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల రక్షణ మరియు సౌకర్యార్థం సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లతో పాటు గురుకుల పాఠశాలల్లో కూడా పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించుట కొరకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. 6 ఎంజేపీ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. 20 ఎంజేపీ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణానికి సాస్కి పథకం కింద రూ.500 కోట్లు మంజూరు చేయనున్నామన్నారు. సింహాచలం మరియు టేకులోడు ఎంజేపీ స్కూల్ లో IIT / NEET ప్రత్యేక కోచింగ్ కేంద్రాల ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రూ.22 కోట్లు వెచ్చించి గురుకులాలకు, వసతి గృహాలకు అవసరమైన వంట పాత్రలు సరఫరా చేశామన్నారు. అన్ని వసతి గృహాల్లోనూ యూపీఎస్ లు, అన్ని వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాలికల వసతి గృహాల్లో రక్షణ కొరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం మరియు సౌకర్యం కొరకు అన్ని వసతి గృహాల్లోనూ మస్కిటో ప్రూఫింగ్ ఏర్పాటు చేశామన్నారు.

**రూ.250 కోట్లతో ‘నేతన్న భరోసా’ అమలు..** నూతన బడ్జెట్ లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద 30 లక్షల మంది బీసీలకు రూ. 11,913.21 కోట్లు కేటాయించామని మంత్రి సవిత తెలిపారు. తల్లికి వందనం పథకం కింద తల్లి ఖాతాకు ఒక్కో పిల్లవానికి రూ. 15,000 చొప్పున అందించేందుకు రూ. 4,097.63 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దీపం--2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్లకు రూ. 1,383.62 కోట్లు కేటాయించామన్నారు. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత విద్యుత్‌కు రూ.50 కోట్లు, నేతన్నలకు విద్యుత్ సబ్సిడీకి రూ. 150 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ఆర్థిక సహాయానికి రూ. 250.42 కోట్లు, నేతన్నలకు ముడి సరకుల కొనుగోలు, మగ్గాల మరమ్మతుల సహాయానికి రూ. 226.11 కోట్లు, నేతన్న భరోసా పథకం కోసం రూ.250 కోట్లు కేటాయించామని మంత్రిసవిత తెలిపారు. ఈ పథకం కింద నేతన్నలకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేయనున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల 2026--27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 10,699.33 కోట్లు కేటాయించామన్నారు.

**బీసీల ద్రోహి జగన్..** జగన్ ప్రభుత్వంలో బీసీలతో పాటు అన్ని వర్గాల వారిని ఇబ్బందులు పాలయ్యారని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. ఆ అయిదేళ్లలో ప్రశ్నించిన బీసీ నాయకులపై కేసులు పెట్టారన్నారు. బీసీ బిడ్డల చదువులను నిర్లక్ష్యం చేస్తూ, సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు సరిపడా నిధులు ఇవ్వలేదన్నారు. బీసీల ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని మంత్రి సవిత మండిపడ్డారు.

**బీసీలకు చంద్రబాబుతోనే రాజకీయ ప్రాధాన్యం..** బీసీలకు రాజకీయ ప్రాధన్యమిస్తున్న సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత కొనియాడారు. కేబినెట్ ఎనిమిది మంత్రులను, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును ఇలా అన్ని కీలక పదవుల్లోనూ బీసీలను సీఎం చంద్రబాబు నియమించారని మంత్రి సవిత తెలిపారు.

# బంగారం ధరల పెరుగుదలకు కారణం అదే: నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** ప్రపంచంలోని ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయని, పసిడి ధరల అనూహ్య పెరుగుదలకు ఇదే కారణమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశంలోకి బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో ఏమీ లేవని అన్నారు. వాటిని ఆర్బీఐ ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు. బంగారం దిగుమతులపై తాము ఆందోళన చెందడం లేదని, కరెంట్ ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉందని వెల్లడించారు. బ్యాంకులు తమ కోర్ వ్యాపారంపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. భారత్ వృద్ధి పథంలో పయనిస్తోందని, అందులో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని నిర్మలా సీతారామన్ కోరారు. అమెరికా టారిఫ్ అంశంపై కూడా ఆమె స్పందించారు. వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక సుంకాలను అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో భారత్ సహా అన్ని దేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ మార్పుల ప్రభావం భారత్‌పై ఎలా ఉంటుందని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని సమీక్షిస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ అంశంపై అప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటు అవుతుందని అన్నారు.

# మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది

- మహిళా సంక్షేమాన్ని మాటల్లో కాదు
- కార్యాచరణలో అమలు చేస్తుంది కూటమి ప్రభుత్వం
- అంగన్ వాడి కార్యకర్తలకు కనీస వేతనాల చట్టానికి అనుగుణంగా దశల వారీగా వేతనాలను పెంచాలి.
- గౌరవ వేతన ఉద్యోగులుగా కాకుండా అంగన్వాడీలను సెమీ-గవర్నమెంట్ ఉద్యోగుల హోదా ఇవ్వాలి.
- స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి.
- మహిళా వ్యాపారాలకు ప్రత్యేక ఈ-మార్కెట్ ప్లేస్ ఏర్పాటు చేయాలి.
- స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రోత్సహించాలి.
- శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.

**అమరావతి,కలంకౌంటర్ :** మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని తద్వారా రాష్టం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. మహిళా సంక్షేమం మరియు అంగన్వాడీ కార్యకర్తల స్థితిగతులపై ఈరోజు శాసనసభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెంచి మహిళా సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా రుణాలపై సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం నిజంగా అభినందనీయమన్నారు. మహిళా సంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో అమలు చేసి చూపిస్తున్నట్టు కూటమింపు కొత్త పాలనను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ప్రశంసించారు. మహిళ సంక్షేమంపై ప్రభుత్వం కేటాయింపులను రాష్ట్ర భవిష్యత్తుపై పెడుతున్న పెట్టుబడిగా ఆమె అభివర్ణించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు అంగన్వాడీ కార్యకర్తల సమస్యల గురించి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలకు ఏడాదిలో కనీసం 30 రోజుల చెల్లింపు వేసవి సెలవులు కల్పించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడి కార్యకర్తలకు పదవీ విరమణ సమయంలో తగిన గ్రాట్యుటీ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు



తీసుకోవాలని కోరారు. దీర్ఘ కాల సేవ చేసినా వారి భవిష్యత్ భద్రత లేదన్న విషయాన్ని ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రాట్యుటీ అమలు చేయాలని ఆమె ప్రభుత్వానికి మనవి చేశారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో ప్రస్తుత గౌరవ వేతనం సరిపోవడం లేదుని కనీస వేతనాల చట్టానికి అనుగుణంగా దశల వారీగా వేతనాలను పెంచాలని పేర్కొన్నారు. డి ఎ లింకేజ్, ప్రమాద బీమా తదితర ప్రోత్సాహకాలు అందజేయాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలను గౌరవ వేతన ఉద్యోగులుగా కాకుండా కనీసం సెమీ-గవర్నమెంట్ హోదా ప్రభుత్వం పరిశీలించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు స్వయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హులే అయినప్పటికీ, అన్ని పథకాలు పూర్తిస్థాయిలో అందట్లేదని ఫిర్యాదులు ఉన్నాయని అర్హత ప్రమాణాలు, డేటా మిస్‌మ్యాచ్ వంటి సాంకేతిక కారణాలతో పేర్లు తొలగిపోతున్నాయని అంగన్వాడి కార్యకర్తల సమస్యలను ఆమె ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం దిశగా వారి ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ ఎగుమతి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా వ్యాపారాలకు ప్రత్యేక ఈ-మార్కెట్‌ప్లేస్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం, వృత్తి భరోసా కల్పించడంతో పాటు సామాజికంగా, రాజకీయంగా బలపరచే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు.

# స్వామి వారి సేవలో బాల బ్రహ్మానంద సరస్వతి







**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం నైమిశారణ్య శ్రీ వారాహి పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామివారిచే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి తత్త్వంపై అనుగ్రహ భాషణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. తొలుత స్వామీజీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నాగ పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి మహిమ, ఆధ్యాత్మిక తత్త్వం, భక్తి మార్గం , సనాతన ధర్మ పరిరక్షణ గురించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించి భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు , ఆలయ అర్చకులు బుద్ధు సతీష్ శర్మ, సిబ్బంది, భక్తులు , గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహ భాషణాన్ని శ్రద్ధగా ఆస్వాదించారు.

# ప్రభుత్వ వైఫల్యమే కారణం.. కల్తీ పాల ఘటనపై జగన్ ఫైర్

● రాజమండ్రిలో కల్తీ పాలతో నలుగురి మృతి! ● ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి ● ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ ● ఒకే పాల వ్యాపారి నుంచి పాలు కొన్న బాధితులు ● పలువురి పరిస్థితి విషమం.. ఆసుపత్రిలో చికిత్స



**అమరావతి,కలంకౌంటర్ :** రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి నలుగురు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆయన, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆహార భద్రత అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని జగన్ ఆరోపించారు. ఈ దారుణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగాలని, అవసరమైతే నిపుణులైన వైద్య బృందాలను పంపాలని జగన్ కోరారు. ఆహార భద్రత తనిఖీలను కట్టుదిట్టం చేసి, పాల వంటి నిత్యావసరాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నగరంలోని లాలా చెరువు, చౌడేశ్వరి నగర్ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా నలుగురు మరణించారు. మూత్రం రాకపోవడం (అనూరియా) లక్షణాలతో వీరు మృతి చెందగా, దీనికి కల్తీ పాలే కారణమని అనుమానిస్తున్నారు. ఆదివారం రాత్రి ఎస్. శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) మరణించారు. అంతకుముందు మరో ఇద్దరు చనిపోయారు. ఈ నెల 15 నుంచి సుమారు 14 మంది అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. బాధితులంతా ఒకే పాల వ్యాపారి వద్ద పాలు కొనుగోలు చేయడంతో కల్తీ జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 35వినతులు-కమిషనర్ ఎన్. మౌర్య.





**తిరుపతి,కలంకౌంటర్ :** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 15 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ కమిషనర్ ను కోరారు. లక్ష్మీపురం కూడలి ప్రారంభించాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని, 18వ వార్డులోని స్మశానం వద్ద మౌళిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ ఎస్. కె బాబు ఫోన్ ద్వారా కోరారు. టీటిడి పరిపాలనా భవనం పక్కన గల రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, ఆర్ అండ్ బి అతిథి గృహం యూడీస్ వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, పద్మావతి పార్క్ వాకింగ్ ట్రాక్ బాగు చేయాలని, కృష్ణాపురం టానా వద్ద తోపుడు బండ్లు ఎక్కువ కావడంతో పార్కింగ్ ఇబ్బందిగా ఉంది పరిశీలించాలని, డివైడర్ల మధ్య చెట్లు ఏండి పోతున్నాయి నీరు పట్టాలని, సీపీయం కార్యాలయం వద్ద రోడ్లు గుంతలు పూడ్చాలని, జగజ్జీవన్ రామ్ పార్క్ వద్ద పెద్ద కాలువ బ్లాక్ అయ్యింది పరిష్కరించాలని, మహిళా వర్సిటీ రోడ్డు ను ఇరువైపులా చిరు వ్యాపారులు ఆక్రమించడంతో ఇబ్బందిగా పరిష్కరించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, కొబ్బరికాయల వ్యాపారస్థులు ఎక్కడివక్కడే పడేస్తున్నారు చర్యలు చేపట్టాలని, రైల్వే కాలనీ పార్క్ వద్ద చెత్త కాలుస్తున్నారు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

# నేతన్నలకు యూనివర్సల్ హెల్త్ పాలసీ

● రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ● మంగళగిరి, పిఠాపురంలో ప్రత్యేక ప్రాజెక్టులు ● రూ.10.44 కోట్లతో 10 క్లస్టర్ల ఏర్పాటు ● జీఎస్టీ మినహాయింపు పరిశీలన : మంత్రి సవిత



**అమరావతి,కలంకౌంటర్ :** యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్.హెచ్.డి)లో భాగంగా మంగళగిరిలో రూ.22.35 కోట్లు, పిఠాపురంలో రూ.12 కోట్లతో చేనేతలకు లబ్ధి కలిగేలా ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టనున్నట్లు వెల్లడించారు. చేనేత వస్త్రాల కొనుగోలుపై జీఎస్టీ మినహాయింపు చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం హయాంలో రూ.120 కోట్ల ఆప్కో నిధులు పక్కదారి పట్టాయని, దీనివల్ల ఆ సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురైందని వెల్లడించారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత పై విధంగా స్పందించారు. రాష్ట్రంలో చేనేత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చేనేత సంక్షేమానికి త్రిఫ్ట్ పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు నగదు పరపతి, ముడి పదార్థాల సరఫరా, ముద్రా వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. త్వరలో నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. చీరాలలో నేతన్నల ఆదాయంతో పాటు చేనేత ఉత్పత్తుల పెంపుదలకు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) కింద రూ.4.17 కోట్లు మంజూరయ్యాయన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్.హెచ్.డి.పి)లో భాగంగా ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిఠాపురంలో రూ.12 కోట్లు, మంగళగిరిలో రూ.22.35 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. రాష్ట్రంలో చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం(ఎస్.సి.డి.పి)లో భాగంగా రూ.10.44 కోట్లతో పది క్లస్టర్లను మంజూరు చేశామన్నారు. సహాయక క్లస్టర్లతో పాటు ఇతర క్లస్టర్లకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**జీఎస్టీ మినహాయింపు..** గత ప్రభుత్వ తీరు వల్ల ఆప్కో నష్టాల్లో కూరుకుపోయిందని మంత్రి సవిత తెలిపారు. ఆప్కో పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.120 కోట్లను గత ప్రభుత్వం తీసుకొచ్చి, పక్కదారి పట్టించిందన్నారు. దీనివల్ల ఆప్కో షో రూమ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ఆప్కోను గాడిలో పెడుతున్నామన్నారు. చేనేత సహకార సంఘాల బకాయిలను చెల్లిస్తున్నామన్నారు. చేనేత వస్త్రాలపై ఆప్కో,చేనేత సంఘాలకు జీఎస్టీ మినహాయింపు చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆప్కో షో రూమ్ ల్లో అమ్మకాలు పెరిగాయని మంత్రి వెల్లడించారు.

**నేతన్నలకు యూనివర్సల్ హెల్త్ పాలసీ..** నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేతన్నలకు చేనేత వస్త్రాల తయారీలో స్కిల్ పెంచేలా శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. చేనేతలకు 2014-19 మధ్య కాలం స్వర్ణయుగమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత మరోసారి చేనేత రంగానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. చేనేతల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని మంత్రి సవిత తెలిపారు.

# అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్





**బాపట్ల,కలంకౌంటర్ :** చట్టపరిధిలో విచారించి నిర్ణిత గడువులోపు అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ అర్జీ దారులకు భరోసా కల్పించారు. ఎస్పీ సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా తమ సమస్యలను జిల్లా ఎస్పీ కి స్వయంగా విన్నవించుకున్నారు. భర్త/అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర పలు సమస్యలతో 70 మంది అర్జీదారులు పిజిఆర్ఎస్ కార్యక్రమానికి విచ్చేశారు. ఎస్పీ వారితో ముఖాముఖీ మాట్లాడి, వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్జీలను విచారించి చట్ట పరిధిలో పరిష్కరిస్తామని వారికి భరోసా నిచ్చారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా చట్టపరంగా విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని అధికారులను హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి. జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ పి. ప్రభాకర్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వం కోసమే అహర్నిశలూ కృషి

(మొదటిపేజీ తరువాయి)



ముందే రిజర్వేషన్లు పెంచి అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నం చేస్తోంది. బీసీ రక్షణ చట్టం ఏర్పాటుకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశాం. అదే విధంగా బీసీల్లో ఉన్న కొందరు ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నారు...వీటిపై ఇప్పటికే చేసిన బిల్లులను కేంద్రానికి కూడా పంపాం. వాటిని ఫాలోఅప్ చేస్తున్నాం' అని చంద్రబాబు అన్నారు.

**జీఓ నంబర్3పై త్వరలోనే ఓ నిర్ణయానికి వస్తాం..** నేను ముఖ్యమంత్రి అయ్యాక మొదటిసారి 1996-1997లో ఎస్సీ వర్గీకరణ చేశాం. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడ లేకపోయాయి. ఇప్పుడు మళ్లీ వర్గీకరణ చేసి ఎస్సీల్లో కూడా సామాజిక న్యాయం చేసిన ఘనత మాది. గిరిజనుల కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ని కూడా గత పాలకులు కాపాడలేకపోయారు. దీంతో ఆ జీఓ నంబర్ 3ను సుప్రీం కోర్టు కొట్టేసింది. ఆచరణతో పాటు అందరికీ ఆమోద యోగ్యంగా జీఓ నంబర్ 3 ఉండాలి. అందుకే సమావేశాలు ఏర్పాటు చేసి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటాం. మైనారిటీలకు రక్షణ కల్పించడంతో పాటు మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనం అందిస్తున్నాం. ఆడబిడ్డలను అన్ని విధాలా ఆదుకుంటున్నాం. ఆస్తి హక్కు, బాగా చదివించడం ఎన్టీఆర్‌తో మొదలయ్యాయి. మహిళలు సాధికారత సాధిస్తే కుటుంబమే కాకుండా సమాజం కూడా సాధికారత సాధిస్తుంది. అగ్రవర్ణాల్లో పుట్టడమే మేం చేసిన పాపమా అని ఆ వర్గంలోని పేదలు బాధపడుతున్నారు. వారిని కూడా ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది. పేదలు ఎక్కడున్నా మా ప్రభుత్వం ఆదుకుంటుంది. త్వరలోనే కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తీసుకొస్తాం. సంజీవని ద్వారా పేదలకు ఆర్థిక వెసులుబాటు కలిగి ఇబ్బందులు తగ్గుతాయి. అన్ని శాఖలకు విజ్ఞప్తి చేస్తున్నా...మీ విభాగాల్లో మంచిగా పని చేసి బలహీనవర్గాలను బలోపేతం చేయాలి. ఇది బలహీన వర్గాల ప్రభుత్వం...బలహీన వర్గాలను ఆదుకుంటాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

# ప్రమాణ స్వీకారం





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఉయ్యూరు వేణుగోపాల స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం లో రాష్ట్ర ఆర్యవైశ్య ప్రముఖులు వెంట్రప్రగడ వీరాంజనేయులు సతీమణి వెంట్రప్రగడ పద్మ సభ్యురాలు గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం లో పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ , మాజీ శాసనమండలి సభ్యులు రాజేంద్రప్రసాద్ , ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ నాని , దేవస్థానం చైర్మన్ భాస్కర్ రావు ,పట్టణ తెలుగు దేశం నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సరస్వతి అమ్మవారి 19వ వార్షికోత్సవం



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణం లోని శ్రీ పొట్టి శ్రీరాములు బజార్ నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో వేంచేసియున్న శ్రీ సరస్వతి అమ్మవారి 19వ వార్షికోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు పవన్ స్వామి, అనిల్ స్వామి అమ్మవారికి పంచామృతాభిషేకం, చందనాభిషేకం, అమ్మవారి మూల మంత్ర హోమం నిర్వహించారు. నీలిశెట్టి వెంకట సుబ్బారావు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయం ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లినిక్‌తో భూ సమస్యలకు సరైన చికిత్స!

● జిల్లాలో విజయవంతంగా అమలవుతున్న విధానం ● ఇప్పటివరకు 388 దరఖాస్తుల స్వీకరణ ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రజల భూ సమస్యల పరిష్కారంలోనూ స్పీడ్ ఆఫ్ డూయింగ్‌కు ప్రాధాన్యమిస్తూ గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా అందుబాటులోకి తెచ్చిన రెవెన్యూ క్లినిక్ జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని.. ఫిబ్రవరి 16వ తేదీ వంకు రెవెన్యూ క్లినిక్ ద్వారా 332 దరఖాస్తులు స్వీకరించగా.. 97 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. తాజాగా సోమవారం నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో 56 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిని కూడా క్షుణ్నంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 2026, జనవరి 5న రెవెన్యూ క్లినిక్ సేవలను అందుబాటులోకి తీసుకురాగా విజయవాడ, నందిగామ, తిరువూరు రెవెన్యూ డివిజన్ల నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు 332 దరఖాస్తులు రాగా.. వీటిలో 22ఏకు సంబంధించి 36 దరఖాస్తులు ఉన్నాయన్నారు. అదే విధంగా ఆర్‌వోఆర్‌కు సంబంధించి 59, మ్యుటేషన్లకు సంబంధించి 18, ఎఫ్-లైన్ 70, ఇతర సమస్యలకు సంబంధించి 121 అర్జీలు రాగా రెవెన్యూ సేవలకు సంబంధించి 28 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. రెవెన్యూ ఫిర్యాదులను వేగంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్‌లు పగడ్బందీగా పనిచేస్తున్నాయని.. మండల తహసీల్దార్లు, ఆర్డీవోలు రికార్డులతో సహా అందుబాటులో ఉంటున్నారన్నారు. అడంగల్‌లో తప్పుల సవరణ, ఎఫ్ లైన్ అర్జీలు, రీసర్వే సమస్యలు, జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు, 22ఏ నిషేధిత భూముల రిజిస్టర్ నుంచి పట్టా భూములను తొలగించుట, ఆక్రమణల తొలగింపు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా, డీ పట్టా సమస్యలు, ఇళ్ల స్థలాల పట్టాలు, భూ సేకరణ సమస్యలు వంటి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడంలో రెవెన్యూ క్లినిక్ కీలకపాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. సాంకేతికపరమైన భూ సమస్యలు, మీ భూమి వెబ్‌సైట్‌కు సంబంధించిన సమస్యలు, సుమోటో కరెక్షన్స్, అడంగల్ నకళ్లు, కంబైన్డ్ స్కెచ్‌లు వంటివాటికి సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ప్రజలు అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యల పరిష్కారం లభించేలా ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం, ప్రజల నమ్మకాన్ని పెంపొందించడంలో రెవెన్యూ క్లినిక్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు.

## వాసవి భవన్ ఆధునీకరణ కమిటీ




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం లో గల వాసవి భవన్ ఆధునికరణ పనులు శరవేగం గా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా పనులు మరింత త్వరగా జరపాలని పెద్దల సూచనతో రాష్ట్ర ఆర్యవైశ్య ప్రముఖులు మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ , మహాసభ అధ్యక్షులు గున్నయ్య శెట్టి , మచిలీపట్నం ఆర్యవైశ్య ప్రముఖులు, జిల్లా ఆర్యవైశ్య ప్రముఖుల వివిధ మండలాలు నుండి వచ్చిన ఆర్యవైశ్య సంఘ సభ్యుల సమక్షంలో ఆధునికరుణ కమిటీ ని ప్రకటించారు.

## ఆర్థిక సాయం




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పెడన నియోజకవర్గం బల్లిపర్రు గ్రామానికి చెందిన హర్షవర్ధన్ గత 13 సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్న కారణంగా వాసవి క్లబ్ వనిత ఇంటర్నేషనల్ ఆద్వర్యంలో రూ 10116 లు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో ఉన్న వాసవి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సన్మానం













**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ రకాలుగా సంఘం కార్యక్రమాలకు సహకరించిన నాయకులకు సన్మానం చేశారు. తొలుత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ,జిల్లా అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్ లను జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు.









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com